# లాకు దగ్గర

స్థానాపతి రుక్మిణమ్మ

"భద్రప్పా!"

"ఉండుండు."

"ఇదిగో - వేగిరం"

"వెనకాతలెవ్వరో వస్తున్నారు. అక్కడే ఒక్క నిమిషం ఆగు."

"ఎంతసేపటినుండో ఉన్నానిక్కడ."

"ఇంక ఒక్క నిమిషం."

"అబ్బా - నేనుండలేను."

"ఉండు మరి లేకపోతే అంతా వెల్లడైపోతుంది."

"అయితే అవ్వనీ. ఎవ్వరికీ తెలియకూడా దేమిటీ."

"తెలిసే మాత్రం; కాస్త రహస్యం వద్దా?"

"దోమలు కుట్టి చంపేస్తున్నాయి పూరికే"

"ఇదిగో, వస్తూవుంది, దగ్గిరైపోయింది, మాట్లాడకు. ఊపిరైనా తియ్యకు. సరే, కబుర్లెటుకూర్చోకు వేగిరం తెముల్చు."

... ... ...

"ఏమే భద్రప్పా! ఇక్కడున్నావు వెడుతున్నావా? వస్తున్నావా?"

"వెళ్ళివస్తున్నాను మీ అమ్మగారూ కులాసాగా ఉన్నట్టు ఉత్తరాలూ పత్రాలూ వస్తున్నాయా శ్యామలా?"

"ఆఁ, తొందరపని వుండి వస్తాం. లాకుదగ్గరెవ్వరేనా ఉన్నారా?"

"ఎవ్వరూ లేరు వెళ్ళు. నేనూ ఇంటికి తొందరగా పోవాలి."

"నయమే కబుర్లెట్టు కూర్చుంది కాదు. ఆకాస్త పుణ్యకాలం ఇక్కడే అయిపోను."

"సరే, మంచిపని కల్పి అడ్డులే, నీవుకూడా సాయంరా అంటుండేమో అనుకున్నాను దాని పుణ్యమా అని ఆమాటమాత్రం అంది కాదు."

"ఇహ నడు అటు పోదాం"

"మనమాట లెవరికేనా వినిపిస్తాయేమో!"

"వినిపించవులే, దూరంపోదాం."

సరే, త్వరగా ముందు నువ్వు నడు."

"ఇప్పుడు మరేమీ వద్దు, చీకటి పడిపోతూ వుంది. అసలు వ్యవహారాలమాట తెముల్చు ఇంటి దగ్గరేమీ కుదరడంలేదు."

"అవును, వెధవలందరి గోలా జాస్తీ అయిపోయింది. వీధంట రావడమే మానేశావు. అయినా తెగించి అప్పుడప్పుడు వస్తూనే వున్నావు."

"ఇలా దగ్గిరిగా రా మరి, వర్తకాన్ని గురించి ఏమైనా ఆలోచించావా లేదా?"

"ఆలోచించకేమీ బాగా ఆలోచించాను. మరి ఇప్పుడెంత కావాలి?"

"ప్రస్తుతం, ఓ వెయ్యిరూపాయలు కావాలి."

"ఆతర్వాతా?"

"ఆతర్వాత ఇంకో వెయ్యి పెట్టాలి. ఆ వెయ్యీ అప్పుడో వందా అప్పుడో వందా పెట్టవచ్చులే. ఎన్ని దఫాలు పెట్టినా ఫరవాలేదు కాని, ఒక్కసారి పెడితేనే మంచిది. ముందు కొద్దిగా పెడితే పని సాగుతూ వుంటుంది."

"నీవు అడిగినవాళ్ళెవ్వళ్ళయినా ఇచ్చారా?"

"ఆఁ ఇవ్వకేమీ ఇచ్చారు. ఆసొమ్ము అప్పులకంటూ పంపించారు."

* ఆనందవాణి

"అయితే, అదేమి షాపో అడగొచ్చు?"

"అడిగితే తప్పేమిటి. ఫాన్సీ గూడ్సు."

"రైలుపట్టాలట్టుకు వెళ్ళే గూడ్సు పెట్టెలా?"

"కాదు, కాదు."

"అంటే ఏమిటి? పెద్దాయన నన్నడిగితే నోరు తిరక్క చెప్పలేకపోయాను. పైగా ఏమీ తెలిసిందికాదు."

"అంటే – స్నోలూ, పౌడర్లూ, మొహానికి అద్దుకునేవన్నమాట. ఇంకా కాగితాలూ, కలాలూ, పెన్సిళ్లూ, పలకలూ, రాసుకునే పుస్తకలూ, సబ్బులూ, ఇవీ అవీ ఏమిటీ అన్నీని."

"బాగా లాభం వస్తుందా?"

"ఓం, ఇంకా అడుగుతావా? విపరీత లాభం వస్తుందంటే నమ్ము. ప్రస్తుతం ఇద్దరుముగ్గురు గుమాస్తాలు ఉండాలి. అందరికీ ఊపిరాడనన్ని పని ఉంటుంది. ఆడాళ్లుకూడా పనిలో వుంటే చాలా మంచిదీ."

"ఆడాళ్లుకూడా పనిచేస్తారా?"

"చెయ్యకేమి. ఆడాళ్లుకాని షాపులో వుంటే — లాభానికేమీ తక్కువ వుండదు, చక్కగా అలంకరించుకున్న ఆడది షాపులో కూర్చున్నదంటే; ప్రతీ కత్తిమొగం అక్కడికే వస్తుంది. వచ్చినవాడూరికే పోతాడా. ఓ అణా సామానో, అర్ధణా సామానో కొంటుంటాడు. కాకపోతే పేరువం తక్కువైపోతుంది. పైగా ఇవి బ్లాకు మార్కెటు కేస్ అంటే; సరుకు దొంగతనంగా అమ్మితే బోల్డు లాభం తెలుసా?"

"అలా అమ్మితే జుల్మానాలు వేస్తారట నిజమే."

"వేస్తే మనకేం పోతుందీ మనమీదే పోదు. ఆ జుల్మానా సొమ్మంతా ప్రజల నెత్తిమీదే వేసేస్తాం. కొనుక్కునేవాడే ఏడతాడు. అదీకాక— కొనుక్కునేవాడు పైకి చెప్పరాని వస్తువులు కొన్ని ఉంటాయి. అవి అమ్మకానికి పెడతాం. అవికాని అమ్మితే లాభం లెక్కకి అందదు ఏమనుకున్నావో! రూపాయికి పదిరూపాయలు."

"ఈ యుద్ధపు రోజుల్లో లాభాలు తింటూ, లోకుల్ని బాధించే వర్తకుల్ని స్వరాజ్యం వచ్చాక




జేబులో డబ్బు ఎక్కువగా ఉన్నవారు ధరలను విపరీతముగా పెంచేసి, అవసర పదార్థములను సామాన్యులకు దొరకకుండా చేస్తారు.

హమాం & 501 సబ్బులకు

న్యాయమైన చిల్లర ధరల కన్న ఎక్కువ చెల్లించవద్దు.

ది టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ, లిమిటెడ్.

"కాంగ్రెసువాళ్లు వాళ్లని ఉరితీసి పారేస్తారట కదూ!"

"ఆఁ, పోనిద్దూ. ఆ పోసుకోలు మాటలు నమ్మక. అందాకా మనం బ్రతికివుంటే అప్పుడు చూద్దాం లే."

"ఇంకేముంది. యుద్ధం అయిపోయింది. కాంగ్రెసువాళ్లందరూ జైళ్ళలోనుంచి వచ్చేస్తారట! రాగానే మనకు స్వరాజ్యం, స్వతంత్రమూ నట!"

"ఒస్, ఇంకా ఎక్కడ. ఎన్నిక అయితే స్వరాజ్యం వస్తుంది! మనవాళ్లూ తురకవాళ్లూ కలవాలి. తర్వాత బ్రిటిషువాళ్లు మనదేశం విడిచిపెట్టిపోవాలి. తెలుసా? ఇదంతా అయ్యేసరికి మనకి మరో జన్మ"—

"అయితే, ఆ బిజినెస్సు ఎప్పటినుంచి ప్రారంభిస్తారు?"

"వచ్చే జూలై ఒకటో తేదీనుండీ ప్రారంభిస్తారు."

"అప్పటికి నీకు సొమ్ము అందించాలా?"

"కాదు, ఈలోపునే ఇవ్వాలి. ఆలస్యం అమృతం విషం."

"నా తెలివి కాలినట్టేవుంది. అసలు సంగతి మరచిపోయాను. ఎవరేనా అడిగితే ఏంచెప్పను? ఈ షాపు ఎవూళ్ళో?"

"విశాఖపట్నంలో అని చెప్పు. అప్పటికి మా అయన్ను రెడీగా ఉండమను."

"అల్లాగేలే. నువ్వు ఇంకో పనిచెయ్యి. మదుపు పెట్టిన వాళ్ళకి ముందుగా అందులో ఉద్యోగం ఇయ్యి. వాటా సొమ్ముకు లాభం పంచిపెట్టు. చాకిరీ చేసినందుకు జీతం ఏర్పాటుచెయ్యి."

"వాళ్ళకు చదువూ సంధ్యా ఏమైనా ఉంటా? చదువుకుంటే అభ్యంతరం ఉండదు."

"చదుసంధ్యలాట్టే ఉన్నట్టవుపించదు. మా ఆయనకున్నంత సమువే వాళ్ళకీ ఉందనుకుంటాను. పని ఇచ్చి, పని ఏవత్తూ మప్పాలి. మప్పితే గ్రహించే తెలివితేటలు ఉన్నాయి."

"మప్పితే తిప్పడం కష్టమై పోతుందేమో ఆలోచించు."

"ఫరవాలేదు. మన చెప్పుచేతల్లో వాళ్లే."

"అవును. చూడూ—ఎవరికైనా ఒకరికి మనం రోజూ ఎదైనా పెడుతున్నామనుకో. ఏ కారణంచేతనో మన మొకనాడు పెట్టలేకపోతాం. అప్పుడామనిషి మనల్ని దుమ్మెత్తిపోస్తాడు. దెప్పుతాడు. ఇంకిమీదా, పిచికిమీదా పెట్టి తెగతిడతాడు. వెనకటికి ఓ ముష్టివాడు—'పెట్టని తల్లి పెట్టనేలేదూ—పెట్టే ముండా ఈరోజున పెట్టలేదూ' అన్నాట్ట, అలాఅవుతుంది.

"లోకంలో అలాంటివాళ్ళూ ఉన్నారు. కాని, వీళ్ళు అలాంటివాళ్లు కారులే."

"అయితే మంచిదే. కాని వారెవరో ఓసారి చూపించు."

"చూపిస్తా. సొమ్ము చేతిలో పడనీ."

"మన కత్తులో వాళ్ళే."

"ఆఁ తొందరపడకు కాస్త తమాయించుకో."

"అయినప్పుడే కాని. అందాకా, నువ్వు ఉన్నావుగా."

"నువ్విదివరకు మరోలా అడిగావు. నే నింకో విధంగా చెప్పాను. నీకు జ్ఞాపకముందో లేదో!"

"అయితే, వేగిరం మాటాడు."

"ఆ ఖూచీనాదే."

"కాని సొమ్మో?"

"రెండురోజులయాక వూరికి వెళ్ళి తెస్తా. ఈ నెలలోపుగా నీకు అందిస్తాను. మరేమీ భయపడకు."

"నీ దగ్గరేమీ లేదా?"

"ఉంది. కాని మా మామయ్యను అడగాలి. అవికూడా తెస్తాను. వడ్డీ సమానంగా ఇస్తున్నాడు. అయితే నీకంటే వాడేమీ హెచ్చు కాదులే."

"నేను చెప్పినంతే కాకుండా ఇంకా హెచ్చుగా జాగ్రత్త పెట్టి, అప్పుడు పెద ఎత్తుగా వ్యాపారం సాగిద్దాం. నీ వళ్ళంతా బంగారం అయిపోతుంది."

"ఉఁ దీపాలు పెట్టారు. నేను ఇలా వెడతాను."

"మరైతే రైటే కదూ!"

"ఆఁ ముమ్మాటికీ రైటు సుబ్బూ!

"నేను ఇలా పోతాను."

"ఉఁ—"

"ఉఁ—"